క్లుప్తంగా

హమాలీలకు యూనిఫాం దుస్తుల అందజేత



కూలీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డైరెక్టర్ ప్రగతి

గురజాల : స్థానిక ఎంఎల్ఎస్ పాయింటులో పనిచేస్తున్న హమాలీలకు గురువారం యూనిఫాం దుస్తులను అందజేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు కూలీలకు దుస్తులు పంపిణీ చేశారు. రేషన్ కార్డుదారులు వాహనాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అందుకోవాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.అద్దెయ్య, తహసీల్దార్ మీసాల దానియేలు, ఏవో శనగల శివనాగిరెడ్డి తదితరులున్నారు.

పన్ను బకాయిలు లేకుండా చూడాలి

నకరికల్లు: ఇంటి పన్ను సకాలంలో వసూలు చేసి, బకాయిలు లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి సీహెచ్ విజయభాస్కర్ రెడ్డి సూచించారు. స్థానిక 1వ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయం సిబ్బంది పనితీరును కార్యాలయానికి వస్తున్న ప్రజలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత పాలన వ్యవస్థ గాడిన పడిందన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం.. రూ.3.20 లక్షల చలానా

దాచేపల్లి : విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మండల వ్యాప్తంగా గురువారం దాడులు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.విజయకృష్ణ, డీఈఈ జె.హరిబాబు ఆధ్వర్యంలో 42 మంది అధికారులు, 84 మంది సిబ్బంది 42 బృందాలుగా విద్యుత్ వినియోగంపై విస్తృతంగా తనిఖీలు చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 89 మంది నుంచి రూ.3.20లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏడీఈ వీరాంజనేయులు, ఏఈలు నాయక్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

పిడుగురాళ్ల: అభివృద్ధే లక్ష్యంగా.. అడుగులు వేస్తున్నట్లు కౌన్సిలర్ నేలటూరి బాలస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని చింతిరాల బజారులో రోడ్డు మరమ్మతు పనులను కౌన్సిలర్ నేలటూరి బాలస్వామి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డులో మరిన్ని సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వార్డు కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

345 మందికి 'జగనన్న తోడు'

రెంటచింతల: మండలంలో 345 మందికి 6వ విడత జగనన్న తోడు పథకం కింద రూ.34.50లక్షలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఇందిరక్రాంతి పథం ఏపీఓ ఎం.చిన్నబాబు గురువారం తెలిపారు. చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి రూ.10 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ అయినట్లు చెప్పారు. సున్నావడ్డీ కింద 10,741 మందికి రూ.2,94,470లు విడుదలైనట్లు తెలిపారు.

19 నుంచి విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

మాచర్ల : విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు 2023–24 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ బిల్లులపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు మాచర్ల విద్యుత్ ఈఈ జె.హరిబాబు తెలిపారు. గురువారం డివిజినల్ విద్యుత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం నుంచి విద్యుత్ శాఖ నియంత్రణ మండలి ఈ నెల 19, 20, 21 తేదీల్లో చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణకు.. డివిజినల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 4.30 గంటల వరకు జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని, తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గురజాల : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీవో షేక్ రుక్సానా సుల్తానా బేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాలలోని చర్లగుడిపాడు-6 (జనరల్), గురజాల-8 (ఎస్సీ), దుర్గి మండలం ఎస్ఎస్ తండ (ఎస్టీ), కారంపూడి మండలం పెదకోదమగుండ్ల శివారు రెడ్డిపాలెం (జనరల్)లో కార్యకర్తల ఖాళీలకు, దుర్గి మండలం ఓబులేశునిపల్లె (ఎస్టీ), జేఎం పాడు (జనరల్) పోలేపల్లి (ఎస్సీ)లో సహాయకుల పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతి గడపకు.. సంక్షేమం, అభివృద్ధి

- ప్రభుత్వ పనితీరుతో సంతోషంగా ప్రజలు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



అలుగుమల్లెపాడులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : సంక్షేమం, అభివృద్ధి ప్రతి గడపకు అందుతోందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరుపై ప్రజలు సంతోషంగా ఉన్నారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని అలుగుమల్లెపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించి, కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర రాజధానుల్లో ఉండే సచివాలయ వ్యవస్థను గ్రామాల్లోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంను సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకొచ్చి.. అవినీతి, లంచాలకు తావులేకుండా పారదర్శకమైన పాలన అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకాన్ని అలుగుమల్లెపాడులో మొట్టమొదటి సారిగా ప్రభుత్వం ప్రారంభించిందని, గ్రామంలో సర్వే చేసి, దీర్ఘకాలిక భూ సమస్యలు పరిష్కరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలుగుమల్లెపాడు అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలబెడతానని ఎమ్మెల్యే కాసు హామీ ఇచ్చారు. ప్రజలకు అధికారం ఇచ్చింది పెత్తనం చేయటానికి కాదని, సేవ చేసేందుకని ప్రజా ప్రతినిధులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, మార్కెట్‌యార్డు చైర్మన్ గొట్టిముక్కల పెద హనిమిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, పట్టణ కన్వీనర్ షేక్ సుబానీ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సునీత



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఏచూరి సునీత సాయిశంకర్

దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ ఏచూరి సునీత సాయి శంకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు ఎంపీపీ పేర్కొన్నారు. అధికారులు తమ శాఖ పరిధిలోని ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులను సున్నితంగా హెచ్చరించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖాధికారులు హాజరుకాకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పిన్నెల్లి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

శాఖలవారీగా అధికారులు..

ఈ సమావేశంలో విద్యుత్ శాఖాధికారి ఎం.రాం బాబు మాట్లాడుతూ.. తమ శాఖ తరపున ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని, విపత్కర పరిస్థితుల్లో తనను సంప్రదించాలని కోరారు. ఎంఈఓ ఎ.సురేష్ మాట్లాడుతూ మండలంలో నాడు– నేడు కార్యక్రమం కింద ఇప్పటి వరకు అదనపు గదుల నిర్మాణం చేపట్టామని, త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి 3.80లక్షల పని దినాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖాధికారి వై.అమీర్‌రెడ్డి మండల పరిధిలోని పంట దిగుబడులను వివరించారు. ముందస్తుగా పత్తి పంట వేయవద్దని, ఉగాది తరువాత వేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కటకం గోపాల్, షేక్ హుస్సేన్, అరిగెల కొండలు, సర్పంచ్‌లు గంగారపు వెంకటరెడ్డి, మమ్ము శివరాం, ఆలేటి వెంకటేశ్వర్లు, అధికారులు పీఓ శివప్రసాద్, రాజు, ముటుకూరు పంచాయతీ సెక్రటరీ శివశంకర్, ఆయా శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా ప్రసాద్



నియామక పత్రం అందజేస్తున్న ఆర్‌సీ

దుర్గి: సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాసవి క్లబ్ దుర్గి శాఖ అధ్యక్షుడిగా కాసుల ప్రసాద్ నాలుగవ సారి ఎన్నికయ్యారు. ఆర్‌సీ మునగాల చిరంజీవి గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాసుల ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల క్లబ్ సభ్యులను కలుపుకొని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలందిస్తామని తెలిపారు. వాసవి క్లబ్‌ను ప్రజలందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శిగా పలుచూరి నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా టెంపర్ శ్రీను నియమితులయ్యారు. జడ్‌సీ మేడం నాగేశ్వరరావు, నాయకులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మాచర్ల అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, కపలవాయి శ్రీనివాసరావు, అప్పారావు, సూర్యనారాయణ, చల్లా బసవయ్య తదితరులు వారిని అభినందించారు.

ఆగిన లారీని ఢీకొట్టిన వాహనం..తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న వాహనం

రెంటచింతల: స్థానిక బీసీ బాలురు సంక్షేమ వసతి గృహం సమీపంలో గురువారం ఆగిన లారీని బొలెరో వేగంగా వచ్చి ఢీకొట్టింది. వేకువజామున జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వరిగడ్డితో మాచర్ల వైపు వెళ్తున్న లారీని మరమ్మత్తుల కారణంగా.. డ్రైవర్ రోడ్డు మార్జిన్లో నిలిపివేశాడు. రెంటచింతల నుంచి మాచర్ల వైపు వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి లారీని బలంగా ఢీకొట్టగా.. డ్రైవర్ నూకరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ లంకలోకి వెళ్లి ఆగిపోయింది.

హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి



పెదకూరపాడు: ప్రజా ప్రతినిధుల వెంట నిర్దిష్ట సమయం లేకుండా ఉదయం 7 నుంచి రాత్రి 11గంటల వరకు నియోజక వర్గాల్లో పర్యటించాల్సి వస్తోందని, ఇంటర్నెట్ లేని ప్రాంతాల్లో పర్యటించాలని కావున ముఖ ఆధారిత హాజరు నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు, వోఎస్డీల వ్యక్తిగత కార్యదర్శులు, సహాయకులకు మినహాయింపు ఇవ్వాలని వ్యక్తిగత కార్యదర్శుల అసోసేషన్ నాయకులు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పీఏ దర్శి వెంకటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్ రెడ్డిని కలిసి విన్నతి పత్రం అందించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ వినతిపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏ, గుంటూరు ఎమ్మెల్యే షేక్ ముస్తాఫా పీఏ, పాలకొండ ఎమ్మెల్యే కళావతి, విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్సీ వంశీ పీఏ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని సంఘవిని అభినందిస్తున్న హెచ్‌ఎం విక్టోరియా

నరసరావుపేట రూరల్: స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం సిస్టర్ అమోస్ విక్టోరియా గురువారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో పాఠశాలలో 8వ తరగతి చదవుతున్న టి.సంఘవి షార్ట్‌పుట్, హ్యామర్‌త్రో విభాగాలలో ద్వితీయస్థానం సాధించి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. శ్రీకాకుళంలో ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో సంఘవి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన సంఘవిని పాఠశాల పీఈటీ భారతీ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

స్వామి వివేకానందకు ఘన నివాళి



వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న గోవిందరెడ్డి

మాచర్ల: స్వామి వివేకానంద సూచనలు భావి భారత తరాలకు అందించాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా ప్రాంతంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిన లాలూ సాహెబ్, శ్రీనివాసరావు, ముప్పవరపు గాంధీ తదితరులున్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాచర్ల: పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో వాణి విద్యానికేతన్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి హెచ్‌ఎం కేవీ రమణ, కరస్పాండెంట్ అంజనీకుమారి తదితరులు బహుమతులు అందజేశారు.పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



దుర్గి: దుర్గిలోని జంగాల కాలనీలో పూరిల్లు దగ్ధమైన ఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన పత్రై హనుమయ్యకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఇంట్లోని దుస్తులు, ఫర్నీచర్ తో పాటు రూ.1.50లక్షల నగదు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు సంబంధించిన డబ్బులు దగ్ధమైనట్లు చెప్పారు. కట్టు బట్టలతో మిగిలామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు, విద్యుత్ ఏఈ ఎం.రాంబాబు, వీఆర్వో పరిశీలించారు.

పురుగుమందు డబ్బాలతో కుటుంబం ఆందోళన..



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన కుటుంబం

కారెంపూడి: తన భూ సమస్యను పరిష్కరించాలని పేటసన్నెగండ్ల గ్రామ శివారు సింగరుట్ల తండాకు చెందిన రామావతు హనుమనాయక్ కారెంపూడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులతో కలసి గురువారం ఆందోళన చేపట్టారు. పురుగు మందు డబ్బాలతో బైఠాయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. హనుమనాయక్‌తో సంప్రదింపులు జరిపారు. తన కుటుంబానికి చెందిన భూమిని సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించిందని హనుమనాయక్ ఆరోపించారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొస్తే న్యాయం చేస్తానని చెప్పి.. అధికారులు వారి ఆందోళన విరమింపజేశారు. అప్పటి వరకు ఆ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. సింగరుట్ల నరసింహస్వామి అగ్రహారం భూములు వందలాది ఎకరాలను రైతులు వంశ పారంపర్యంగా సాగు చేసుకుంటూ.. అనుభవిస్తున్నారని, అలాంటి భూమే ఇది కావచ్చని తహసీల్దారు పేర్కొన్నారు. అసలు ఏం జరిగిందో విచారించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి సర్ది చెప్పారు.

గురజాల ఏఎంసీ డైరెక్టర్లుగా ఆరుగురికి అవకాశం



మండ్లేం రామారావు



షేక్ జానీబాషా



బాణావత్ సైదానాయక్



బైరెడ్డి శివపార్వతి



యర్రంశెట్టి నాగలక్ష్మి



నందికొండ ఆదిలక్ష్మి

దాచేపల్లి : గురజాల వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా మండలానికి చెందిన ఆరుగురిని నియమించడం జరిగింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాచేపల్లి నగర పంచాయతీకి చెందిన మండ్లేం రామారావు, షేక్ జానీబాషా, యర్రంశెట్టి నాగలక్ష్మి, ఇరికేపల్లికి చెందిన నందికొండ ఆదిలక్ష్మి, కాట్రపాడుకు చెందిన బాణావత్ సైదానాయక్, రామాపురానికి చెందిన బైరెడ్డి శివపార్వతి డైరెక్టర్లుగా బాధ్యతలు తీసుకోనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో మార్కెట్‌యార్డు అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు వారిని అభినందించారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల సీడీపీవో కార్యాలయం పరిధిలో ఐదు అంగన్‌వాడీ సహాయకుల(ఆయాలు) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పిడుగురాళ్ల సీడీపీవో శ్రీవల్లి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలోని ప్రజాశక్తినగర్ నగర్ 2వ అంగన్‌వాడీలో జనరల్ 1, టెలిఫోన్ ఎక్ఛేంజ్ ప్రాంతంలో జనరల్ 1, శ్రీనివాస కాలనీ 3లో ఎస్టీ జాబితాలో ఒకటి ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. మండలంలోని చెన్నాయిపాలెం గ్రామం బీసీ కాలనీలో జనర్ పోస్టు 1, దాచేపల్లిలోని వడ్డెర బజారులో బీసీఏ కేటగిరిలో ఒక పోస్టు ఖాళీగా ఉందని వెల్లడించారు. మొత్తం ఐదు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 7వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు జులై 1వ తేదీకి 21ఏళ్లు నిండి 35 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. వివాహితులైన వారు, స్థానికంగా నివాసం ఉంటున్న వారు అర్హులన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు విద్య, ధృవ పత్రాలతో దరఖాస్తును ఈ నెల 25న సాయంత్రం 5గంటల లోపు పిడుగురాళ్ల పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో స్వయంగా అందించాలని తెలిపారు.

ఫార్మశిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు బాధ్యతగా పనిచేయాలి

నరసరావుపేట: ఫార్మశిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు సక్రమంగా సమయపాలన పాటిస్తూ అన్ని రకాల ఉద్యోగ నిర్వహణను బాధ్యతలను నిర్వహిస్తూ జిల్లాను మంచి స్థాయిలో నిలపాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. శోభారాణి కోరారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డాక్టర్ శోభారాణి అధ్యక్షతన జిల్లాలో నూతనంగా నియమితులైన 12 మంది ఫార్మశిస్టులు, 17 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు ఓరియంటేషన్ శిక్షణ క్యాంపు నిర్వహించారు. డెప్యూటీ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు అన్ని రకాల రికార్డులను నిర్వహిస్తూ, ప్రభుత్వ వైద్యాధికారి సూచించిన అన్ని రకాల టెస్టులను నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఫార్మశిస్టులు వ్యాక్సిన్, మందుల నిర్వహణలను సకాలంలో పూర్తి చేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి కోరారు. డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం 16వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మైదవోలు గ్రామానికి చెందిన పల్లపు శివపోలయ్య (32) బైక్‌పై 16వ నంబర్‌జాతీయ రహదారి బోయపాలెం అండర్‌పాస్ వంతెన మీదుగా రాంగ్‌రూట్లో ఇంటికి వచ్చే క్రమంలో ఎదురుగా వచ్చిన గుంటూరు ఆర్టీసీ బస్సు ఢీకొంది. సుమారు రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో వాహనాలు రెండు పాక్షికంగా ధ్వంసం కావడంతో పాటు బైక్‌పై ఉన్న శివపోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కోటి వీరయ్య ఫిర్యాదు మేరకు గురువారం పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలాఉండగా, గతేడాది జనవరి 31న శివపోలయ్య భార్య గోవర్ధిని మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నంపై డీఎస్పీ విచారణ

ముప్పాళ్ళ: మండలంలోని మాదల గ్రామానికి చెందిన రైతు ఆత్మహత్యాయత్నంపై సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మత్రిపూడి లక్ష్మయ్య అనే రైతు.. తన స్థలం హద్దులు మారుస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన విధితమే. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై సర్వేయర్‌తో డీఎస్పీ మాట్లాడి, వివరాలు సేకరించారు. వివాదాలకు తావు లేకుండా, సమస్య పరిష్కరించాలని సర్వేయర్‌కు సూచించారు. ఎస్సై ఎం.పట్టాభిరామయ్య, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

పాస్టర్లకు దుస్తులు పంపిణీ

రాజుపాలెం: సమాజానికి దేవుని వాక్యం బోధించే ప్రతి సేవకుడు.. మంచి జీవితానికి ఒక మార్గాన్ని చూపించాలని జైన్ పెంతెకోస్తు చర్చి ఫౌండర్ బిషప్ ఫ్రాన్సిస్ జాక్సన్ పేర్కొన్నారు. మండలంలోని కొండమోడులో గల సజీవుని ప్రార్థన మందిరంలో అలీవ్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఫౌండర్ జీఎస్‌ఆర్ రెడ్డి ఆధ్వర్యంలో సేవకుల సదస్సు గురువారం ఘనంగా జరిగింది. ఈ సదస్సులో 110 మంది పాస్టర్లకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సభకు అధ్యక్షుడిగా బిషప్ జోసఫ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ రూజ్‌వెల్ట్, రెవరెండ్ ఐజాక్ పాల్, లివింగ్ స్టన్, మండల డివైన్ పాస్టర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయుష్ వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. సీజన్ వ్యాధులు, మలేరియా, డెంగీ వ్యాధుల గురించి వైద్యులు శ్రీనివాస్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. వెంకటాచారి, శ్రీను, శేఖర్, రాము, కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగింత

నరసరావుపేట టౌన్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు మీసాల ప్రతాప్ అతని తల్లి అరుణతో నరసరావుపేటకు వచ్చాడు. ఆడుకుంటూ రామిరెడ్డిపేటకు వెళ్లి తప్పిపోయాడు. అక్కడ ఏడుస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అతన్ని విచారించగా స్వగ్రామం పిడుగురాళ్ల అని తెలిపాడు. బాలుడిచ్చిన చిరునామాలో గృహానికి వెళ్లి విషయాన్ని తెలియజేశారు. కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వచ్చి తమ కుమారుడిని తీసుకెళ్లారు.

వెయ్యి గంగాళాలతో స్వామివారికి నివేదన



ఉత్సవ విగ్రహాలకు నివేదన సమర్పిస్తున్న భక్తులు, ఆలయ నిర్వాహకులు

వినుకొండ టౌన్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస నగర్ నందు గల అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంక్రాంతి, ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా కూడారై ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రావణ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడు, గోదాదేవి మూర్తులకు 108 గంగాళాలతో పాయసం, 108 గంగాళాల వెన్నతో నివేదన కార్యక్రమం, ఉత్సవ మూర్తులకు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలు స్వామి వారికి వేయి గంగాళాలతో నివేదన అర్పించారు. ఆలయ నిర్వాహకులు రెడ్డి బంగారయ్య, అచ్యుత కృష్ణ, సుబ్బారావు, కాశ్ల రామ కోటేశ్వరరావు, గుడిపాటి కోటేశ్వరరావు, మోటమర్రి నరసింహారావు, సనిశెట్టి వెంకట సుబ్రహ్మణ్య అప్పారావు పాల్గొన్నారు.